క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


ఎమ్మెల్యే సబితకు మొక్క అందజేస్తున్న నాయకులు

కడ్తాల్: మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని సోమవారం నగరంలోని ఆమె నివాసంలో సర్పంచ్‌ల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, నాయకులు అశోక్, దాస్, సురేశ్ ఉన్నారు.

నియామకం


నర్సింహారెడ్డి, బీజేపీ పుర అధ్యక్షుడు

ఇబ్రహీంపట్నం రూరల్: బీజేపీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడిగా ఎంపీపటేల్‌గూడకు చెందిన గజ్జెల నర్సింహారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ సంస్థాగత ఎన్నికల్లో భాగంగా అధ్యక్షుడిగా తనను నియమించారని, పార్టీ బలో పేతానికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించిన అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా 'నూకం'



మంచాల: బీజేపీ మంచాల మండల నూతన అధ్యక్షుడిగా ఆరుట్ల గ్రామానికి చెందిన నూకం రాజు ముదిరాజ్‌ను నియమించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి సన్మానం

ఆమనగల్లు: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో సోమవారం ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ తాళ్ల రవీందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. డైరెక్టర్‌గా అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

మైసమ్మ సన్నిధిలో మాజీలు

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మను సోమవారం రాష్ట్ర మాజీ మంత్రులు అమర్‌సింగ్ నాయక్, రవీందర్‌నాయక్‌లు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఇరువురిని శాలువాతో సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. సేవాలాల్ సేన రాష్ట్ర నాయకుడు లక్పతినాయక్, మార్కెట్ డైరెక్టర్ నరేశ్ నాయక్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

షాబాద్: పేద ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడికవర్ ఆస్పత్రి డాక్టర్ అచ్చుత్‌రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధి హైతాబాద్ గ్రామంలో శ్రీరామదూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 310 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం రోగులకు ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు. ట్రస్టు సభ్యులు కాలేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, శ్రీకాంత్ ఉన్నారు.

కార్పొరేట్ సేవలతో జీవన ప్రమాణాలు మెరుగు

కందుకూరు: కార్పొరేట్ సంస్థలు సమాజాభివృద్ధిలో కీలక భూమిక పోషించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. మండల పరిధి మీర్‌ఖాన్‌పేటలో అమేజాన్ వెబ్ సర్వీసెస్ సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులను సోమవారం ఆ సంస్థ గ్లోబల్ డేటా సెంటర్ ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్ సెర్జియో లొరెయిరోతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్పొరేట్ సంస్థలు సమాజ సేవలో భాగంగా చేపట్టే పనులతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. అమేజాన్ వెబ్ సర్వీస్ సంస్థ చేపట్టే వివిధ అభివృద్ధి పనుల ద్వారా సమాజంపై సానుకూల ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని వెల్లడించారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మిగిలింది పది రోజులే..

- ముగియనున్న మున్సిపాలిటీల పదవీకాలం
- మాజీలు కాబోతున్న తాజా పాలకవర్గం
- వర్గపోరు, అవిశ్వాసాలతో కుంటుపడిన అభివృద్ధి
- పడకేసిన పెండింగ్ పనులు


ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయం

ఇబ్రహీంపట్నం: మరో 10 రోజుల్లో మున్సిపాలిటీల పాలకవర్గం పదవీ కాలం ముగియనుంది. 2020 జనవరి 22న మున్సిపల్ ఎన్నికలు నిర్వహించారు. అదే నెల 25న ఓట్ల లెక్కింపు కాగా, 27న చైర్మన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు బాధ్యతలు చేపట్టారు. నాటి రోజును పరిగణనలోకి తీసుకుంటే ఈ నెల 24తో వారంతా మాజీలు కాబోతున్నారు. పట్నం మున్సిపాలిటీ పాలకవర్గం ఐదేళ్ల పదవీ కాలంలో చైర్ పర్సన్ కప్పరి స్రవంతిపై పెట్టిన అవిశ్వాసం వీగిపోగా, వైస్ చైర్మన్ ఆకుల యాదగిరిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గి, ఆయన పదవి చేజారగా.. ఆయన స్థానంలో మంగ యాదవ్ ఎన్నికయ్యారు. పుర పరిధిలో ఇబ్రహీంపట్నం, శేరిగూడ, సీతారాంపేట, ఖానాపూర్ గ్రామాలు ఉండగా.. వాటిల్లోని 24 వార్డులకు 24 మంది కౌన్సిలర్లున్నారు.

రసవత్తర రాజకీయాలు

చైర్ పర్సన్ స్రవంతికి గడిచిన ఐదేళ్ల కాలం కలిసి వచ్చింది. జనరల్ మహిళ కౌన్సిలర్ స్థానం నుంచి ఎస్సీ మహిళ అయిన ఆమె.. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొంది, చైర్‌పర్సన్ పదవిని దక్కించుకుంది. అనతి కాలంలోనే ఆమెపై మెజార్టీ కౌన్సిలర్లు అసమ్మతిరాగం వినిపించారు. నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ఆమెకు విభేదాలు తలెత్తాయి. ఇదే అదనుగా భావించిన కౌన్సిలర్లు.. ఆమెను కుర్చీ దింపాలని పావులు కదిపారు. మూడేళ్ల కాల పరిమితి ముగియగానే 24 మంది కౌన్సిలర్లలో 20 మంది అవిశ్వాస తీర్మానం పెట్టాలని సంతకాలు చేసి, 2023 జనవరి 27న అధికారులకు నోటీసులు అందజేశారు. అయితే.. అదే సంవత్సరం అసెంబ్లీ ఎన్నికలు వస్తున్న తరుణంలో మున్సిపాలిటీల అవిశ్వాసాల జోలికి వెళ్లొద్దని నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం భావించింది. అవిశ్వాసం పెట్టే గడువును నాలుగేళ్లకు పెంచుతూ చట్ట సవరణ బిల్లు తీసుకురాగా, గవర్నర్ ఆమోదించలేదు. దీనిని సాకుగా చూపి రాష్ట్రంలోని పలువురు మున్సిపల్ చైర్మన్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ లోపు అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడటంతో షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల అయింది. దీంతో మరో సంవత్సరం చైర్ పర్సన్ పదవిలో స్రవంతి కొనసాగే అవకాశం దక్కింది.

చైర్ పర్సన్‌కు కలిసొచ్చిన కాలం


కప్పరి స్రవంతి, చైర్ పర్సన్

శాసనసభ ఎన్నికల నేపథ్యంలో సొంత పార్టీ కౌన్సిలర్ల అసమ్మతిని, నాటి ఎమ్మెల్యే పోరును తట్టుకోలేక చైర్ పర్సన్ స్రవంతి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అనంతరం కాంగ్రెస్ అధికారం చేపట్టడం, ఎమ్మెల్యేగా అదే పార్టీ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి విజయం సాధించడం ఆమెకు మరోసారి కలిసి వచ్చింది. ఎన్నికల ముందు ఇద్దరు ముగ్గురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లోకి అటు, ఇటుగా మారారు. ఈ నేపథ్యంలో స్రవంతిపై అవిశ్వాసం పెట్టేందుకు 15 మంది బీఆర్‌ఎస్, ఇద్దరు బీజేపీ కౌన్సిలర్లతో కలిసి 17 మంది సంతకాలు చేసి.. గతేడాది జనవరి 8న కలెక్టర్‌కు అందజేశారు. ఈ క్రమంలో చైర్ పర్సన్ పదవిని కాపాడేందుకు ఎమ్మెల్యే రంగారెడ్డి ఎక్స్ అఫీషియో సభ్యుడిగా నమోదు చేసుకున్నారు. అయితే సంతకాలు పెట్టిన వారిలో ఇద్దరు కౌన్సిలర్లు చివరి నిమిషంలో స్రవంతి వైపు మొగ్గుచూపడంతో.. ఆమెకు పదవి గండం తప్పింది. రసవత్తర రాజకీయ పరిణామాలతో 2024 ఫిబ్రవరి 16న పెట్టిన అవిశ్వాసం ప్రక్రియలో స్రవంతి పై చేయి సాధించారు. పదవిలో కొనసాగుతున్నారు.

నిలిచిన పనులు

ఐదేళ్ల కాలంలో మున్సిపాలిటీ పరిధి వార్డుల్లో అభివృద్ధి పనులు అంతంత మాత్రమే జరిగాయి. ఆర్భాటంగా శంకుస్థాపనలు చేసిన పనులు మధ్యలోనే ఆగిపోయాయి. పాత బస్టాండ్ వద్ద కాంప్లెక్స్ నిర్మాణం, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్, పాత పోలీస్‌స్టేషన్ వద్ద కూరగాయల మార్కెట్, అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కొత్త కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు కొత్తగా చేపట్టిన దాఖలాలులేవు. రహదారులు, వీధి లైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.

ప్రత్యేకాధికారుల పాలన

పురపాలక వర్గం పదవీకాలం ముగియనుండగా.. మున్సిపాలిటీలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లనున్నాయి. ఇప్పటికే గడిచిన ఏడాది కాలంగా గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక పాలనే కొనసాగుతోంది. నాటి నుంచి అదిగో ఇదిగో స్థానిక ఎన్నికలంటూ ప్రభుత్వం ఊరిస్తుండగా.. ప్రస్తుతం పుర పాలకవర్గం పదవీ కాలం దగ్గరపడుతోంది. వారూ మాజీలుగా మారనున్నారు. తాజా పరిణామల నేపథ్యంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడెప్పుడు జరుగుతాయా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు.

'ఆకుల' స్థానంలో.. మంగ


బర్ల మంగయాదవ్, వైస్ చైర్ పర్సన్

చైర్ పర్సన్ స్రవంతిని పదవి నుంచి తప్పించేందుకు బీఆర్‌ఎస్‌కు చెందిన వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి కీలకపాత్ర పోషించారని.. చైర్‌పర్సన్ వర్గీయులు భావించారు. ఎలాగైనా ఆకులను వైస్ చైర్మన్ పదవి నుంచి తప్పించాలని వేసిన రాజకీయ ఎత్తుగడలు సక్సెస్ అయ్యాయి. ఆమె స్థానంలో 24 మే, 2024న వైస్ చైర్ పర్సన్‌గా బర్ల మంగ యాదవ్‌ను కౌన్సిలర్లు ఎన్నుకున్నారు. ఐదేళ్ల కాలంలో రెండేళ్ల పాటు పాలన సాఫీగా సాగినా.. తదనంతరం చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు మున్సిపల్ అభివృద్ధికి ఆటంకంగా మారాయి.

సంప్రదాయాలను కాపాడుకోవాలి


ముగ్గుల పోటీలను తిలకిస్తున్న నాయకులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

కడ్తాల్: సంక్రాంతి ముగ్గులు కేవలం అలంకరణ కోసమే కాదని, దేశ సంస్కృతి, సంప్రదాయాల స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. మన సంస్కృతి సంప్రదాయలను కాపాడుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో గూడూరు నారాయణరెడ్డి స్మారకార్థం ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముగ్గులు వేయడం ఒక రకమైన ధ్యానం లాంటిందని, ఇదీ మనస్సుకు శాంతి కలిగించడంతో పాటు.. సృజనాత్మకత వెలుగు చూస్తుందని తెలిపారు. అనంతరం జ్ఞాన ప్రసూన శర్మ ఆధ్వర్యంలో న్యాయ నిర్ణేతల బృందం విజేతలను ప్రకటించింది. ప్రథమ బహుమతిగా స్వప్న రూ.10,116, ద్వితీయ బహుమతిగా పల్లవి, శారద రూ.5,116, తృతీయ బహుమతులు కావ్య, ప్రేమలత, సంతోష రూ.1,116 గెలుచుకున్నారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ.. ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, డాక్టర్ గూడూరి స్వప్న, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సత్యంయాదవ్, జహంగీర్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

'మంద' సేవలు చిరస్మరణీయం


ఆమనగల్లు: జగన్నాథం భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: తెలంగాణ సాధనలో మంద జగన్నాథం సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు అన్నారు. నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ జగన్నాథం అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం నగరంలోని ఆయన నివాసంలో మంద పార్థివ దేహానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తదితర నాయకులు నివాళులర్పించారు.

నివాళి

ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారి కూడలిలో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీ మందా జగన్నాథం చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

నాలుగు సార్లు ఎంపీగా..

కడ్తాల్: తెలంగాణ సాధన సమయంలో పార్లమెంటులో తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించిన నాయకుడు మంద జగన్నాథం అని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. నాలుగు పర్యాయాలుగా నాగర్‌కర్నూల్ ఎంపీగా నియోజకవర్గానికి ఆయన ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. అనారోగ్యంతో బాధపడుతూ జగన్నాథం మృతి చెందగా.. నగరంలోని ఆయన నివాసంలో మంద పార్థివదేహానికి జైపాల్ యాదవ్ ఇతర నాయకులు నివాళులర్పించారు.

కల్యాణం.. కమనీయం


ఆమనగల్లు: స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఘనంగా గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవం

ఆమనగల్లు: గోదా రంగనాథస్వామి కల్యాణోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో నెల రోజులుగా ధనుర్మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణం నిర్వహించారు. అంతకు ముందు బాజా భజంత్రీలతో ఉత్సవ మూర్తులను ఆలయ మండపానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన దేవేందర్‌శెట్టి, డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పలువురు మహిళలు తలంబ్రాలు తీసుకువచ్చారు. అనంతరం మండపంలో పూజారి గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.


అబ్దుల్లాపూర్‌మెట్‌లో..


ఇబ్రహీంపట్నం: నృసింహస్వామి ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవం

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ శ్రీరామాలయంలో గోదాదేవి రంగనాయకస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఏటా భోగిని పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గోదా సమేత శ్రీరంగనాథ స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయ ప్రాంగణం రామాలయం మండపంలో పురోహితులు నటరాజ్ శర్మ, అరుణ్ శర్మల వేద మంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించారు. అనంతరం మర్వాడి వేణు భక్తులకు అన్నప్రసాదం సమర్పించారు. దేవాలయ మాజీ డైరెక్టర్ తమ్మళ్ల కృష్ణ, రేణిగుంట్ల కృష్ణ, అశోక్‌రెడ్డి, శ్రీనువాసాచారి, శేఖర్ ఉన్నారు.

సర్వే రెమ్యూనరేషన్ ఇవ్వాలి

చేవెళ్ల: ప్రైమరీ స్కూల్ టీచర్లతో చేయించిన కులగణన సర్వేకు సంబంధించిన రెమ్యూనరేషన్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్‌జీటీ సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్ డిమాండ్ చేశారు.

పల్లెల్లో సంక్రాంతి సంబురాలు

- వీధుల్లో భోగి మంటలు
- పతంగులతో చిన్నాపెద్దా కేరింతలు


ఇబ్రహీంపట్నంలో పతంగుల విక్రయాలు


యాచారం: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు


ఆమనగల్లులో.. పతంగుల విక్రయాలు

ఇబ్రహీంపట్నం/యాచారం/ఆమనగల్లు/కడ్తాల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మూడు రోజుల వేడుకల్లో భాగంగా సోమవారం భోగి పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆడబిడ్డలు ఇంటి ముంగిట్లో రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ప్రతిష్ఠించారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నాపెద్ద తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేస్తూ కేరింతలు కొట్టారు. పిండి వంటలు ఆరగించారు. రాత్రి వేళల్లో గ్రామాల వీధుల్లో భోగి మంటలు పెట్టారు.



యువత సామాజిక సేవలో ముందుండాలి

- ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు
- గ్రామాల్లో సంక్రాంతి క్రీడోత్సవాలు ప్రారంభం


ఇబ్రహీంపట్నం రూరల్: క్రీడలను ప్రారంభిస్తున్న ఏసీపీ రాజు తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: సామాజిక కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి తులేకలాన్ గ్రామంలో భాస్కర్ స్మారక క్రీడోత్సవాలను సంక్రాంతి పండగను పురస్కరించుకొని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం సీఐ నర్సింహరావు, పట్నం ఎస్ఐ రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, మాజీ సర్పంచ్‌లు బీరప్ప, యాదగిరి, ఎంపీటీసీ నాగమణి, మాజీ ఉప సర్పంచ్ రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించాలి

గ్రామీణ క్రీడలను ప్రభుత్వాలు ప్రోత్సహించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ కోరారు. మండల పరిధి పోల్కంపల్లిలో సంక్రాంతి క్రీడోత్సవాలను ప్రారంభించారు. ఇందులో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేలు, మండల కార్యదర్శి సీహెచ్ బుగ్గరాములు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను ఆమనగల్లు సీఐ ప్రమోద్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్, ఫిల్మ్‌నగర్ ఎస్ఐ హరీశ్, నాయకులు చెన్నకేశవులు, శ్రీశైలంగౌడ్, సురేశ్, రాఘవేందర్, కురుమయ్య, గిరి, మధు, శ్రీనివాస్, రాజు, సాయినాథ్ ఉన్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

యాచారం: యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, సన్మార్గంలో నడుచుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఏసీపీ కేపీవీ రాజు సూచించారు. మండల పరిధి మొండిగౌరెల్లి గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ స్పాన్సర్‌గా ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 120 మంది యువతకు టీషర్ట్, బాల్, బ్యాట్‌లు అందజేశారు. కొత్తపల్లి గ్రామంలో ఏసీపీ రాజు, సీఐ నర్సింహరావులు క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఆదిబట్ల ఏఎస్ఐ కట్టెల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

ఆమనగల్లు: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్. శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండలం చెన్నంపల్లి, ఇస్రాయిపల్లి గ్రామాల్లో క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. మాజీ సర్పంచ్‌లు వెంకటయ్య, లింగంగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ కృష్ణయ్య, నాయకులు శేఖర్‌రెడ్డి, వెంకటయ్య, అజీజ్, జంగయ్య, వెంకటేశ్, రాఘవేందర్, శ్రీకాంత్ ఉన్నారు.

